నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 3 మే 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


ర్యాలీలో విజయకేతనం చూపిస్తున్న ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్, మాజీఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కాంగ్రెస్, బీజేపీలను ఖతం చేయాలి

- కమలం పార్టీతో రాజ్యాంగానికి ప్రమాదం
- ఈసీ నిషేధం విధించినా ప్రచారం ఆగదు..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- గతానికి మించిన మెజార్టీ అందిద్దాం..
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఆమనగల్లులో గిరిజన సభ

కల్వకుర్తి, మే 2 : గ్యారెంటీల గారడీ కాంగ్రెస్, కల్లోల బీజేపీని ఖతం చేస్తేనే ప్రజలకు మేలు చేకూరుతుందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆమనగల్లులో నిర్వహించిన గిరిజన గర్జన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి ఆర్ఎస్పీ హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలో గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజన గర్జన కార్యక్రమం అనంతరం మాడ్గుల, ఇర్విన్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యావంతుడైన ఆర్ఎస్పీని గెలిపిస్తే పేదల గొంతుక ఢిల్లీ గడ్డపై గర్జిస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి గతానికి మించిన మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీలు నేనావత్ అనురాధ, దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన గిరిజనులు

ప్రలోభాలకు లొంగొద్దు..

ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తుంది. గురుకులాల కార్యదర్శిగా 10లక్షల మంది విద్యార్థులను ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దా. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో పేదింటి బంజారా బిడ్డ మలావత్ పూర్ణను ఎవరెస్ట్ శిఖరం ఎక్కించా. గురుకులాల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు అందించటం వల్ల ఎంతోమంది డాక్టర్లు, ఇంజినీర్లు, పైలట్లు, సైంటిస్టులుగా తయారయ్యారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులను అభివృద్ధి చేసిన ఘనుడు కేసీఆర్. రేవంత్ సీఎం అయ్యాక కరెంట్, సాగు, తాగునీటి కష్టాలు, కన్నీళ్లే మిగిలాయి. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రలోభాలకు లొంగకుండా మే 13న కారు గుర్తుకు ఓటు వేయాలి. నేను పార్లమెంట్‌లో ఉంటే దళిత, బడుగు, బలహీన వర్గాలు ఉన్నట్లే. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గిరిజనుల కోసం గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో గిరిజన, మైనార్టీ వ్యక్తులు మంత్రులుగా లేరు. నేను ఎంపీగా గెలిస్తే నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరసలో ఉంచుతాను.

– ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ కందనూలు ఎంపీ అభ్యర్థి

కల్లబొల్లి మాటలతో అధికారంలోకి..

శ్రీరంగాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, మే 2 : కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. హామీలను గాలికొదిలేసి ప్రజలను నిలువునా మోసం చేసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన శ్రీరంగాపురంలో పర్యటించారు. ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టి హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిందని.. వాటిని అమలు చేయకుండా మళ్లీ మోసం చేయడానికి ప్రజల ముందు కొస్తున్నదన్నారు. ఆ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్పీని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లొస్తే ఆరు గ్యారెంటీల అమలుపై ఒత్తిడి తీసుకురావొచ్చన్నారు. కేసీఆర్ ప్రచారానికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై ప్రచారాన్ని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు శ్రీధర్, శ్రీరంగాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు పృథ్వీరాజ్, గౌడనాయక్, మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- ఆర్ఎస్పీ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలి
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- అయిజలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

అయిజ, మే 2 : ప్రజలకిచ్చిన 420 హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి విమర్శించారు. గడిచిన నాలుగు నెలల్లో ఒక్కటి మినహా మిగతా వాటిని గాలికొదిలేసి ప్రజలను గందరగోళంలోకి నెట్టిందన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో అయిజ పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడితో కలిసి సమావేశంలో మాట్లాడారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 4ఎకరాలు ఉన్న వారికి మాత్రమే రైతుబంధు వేసి మిగతా రైతుల పొట్టకొడుతున్నదన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పారదర్శకంగా జరిగిందన్నారు. అబద్ధాలు ప్రచారం చేసి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అయిజ పెద్దవాగుపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు వినతిపత్రం అందజేశారు. నెల రోజుల్లోనే పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బలపర్చిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే విజయుడు పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ హయాంలో ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే పని పెట్టుకున్నారన్నారు. పది రోజులపాటు బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ఆర్ఎస్పీని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నారు.

పేలుతున్న మాటల తూటాలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఆయా పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు తిట్ల పురాణాన్ని అందుకుంటున్నాయి. కేంద్రంలో ఉన్న బీజేపీ నేతలు ఏం చేయలేదని కాంగ్రెస్ విమర్శిస్తుంటే.. 70 ఏండ్లు దేశాన్ని పాలించి ఏం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోంది. మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని తొక్కి పెట్టేందుకు ప్రయత్నించిన ఈ రెండు పార్టీలను భూస్థాపితం చేయాలని బీఆర్ఎస్ ప్రతి విమర్శలు చేస్తున్నది. బీఆర్ఎస్ పాలమూరు లోక్‌సభ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి.. కాంగ్రెస్, బీజేపీలను కడిగిపారేస్తున్నారు. ఇటీవల పలు సమావేశాల్లో ఈ రెండు పార్టీలకు ప్రశ్నలు సంధిస్తూ తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. కందనూలు ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని.. దేవుడి పేరుతో ఒకరు, దేవుళ్ల మీద ఒట్లతో మరొకరు ఓట్లు అభ్యర్థిస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. బలహీన వర్గాలను అణిచివేసేందుకు కుట్రలు చేస్తున్న జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిస్తున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి డీకే అరుణ.. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ఇద్దరూ లోకల్, నాన్ లోకల్ అంటూ తిట్టుకుంటున్నారు. పత్రికల్లో రాయలేని భాషతో మాట్లాడుతుండడంతో ఓటర్లు విస్తుపోతున్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కారు జోరు.. ప్రచార హోరు

- ఎంపీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- ఇంటింటి క్యాంపెయిన్‌కు గులాబీ దళం శ్రీకారం
- కేసీఆర్ టూర్‌తో మారిన ఉమ్మడి జిల్లా ముఖచిత్రం
- పాలమూరులో మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కందనూలులో ఆర్ఎస్పీ దూకుడు
- ఎండను సైతం లెక్క చేయకుండా ముందుకు..

మహబూబ్‌నగర్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు ప్రచార హోరుతో ముందుకు సాగుతున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు పది రోజులే ఉండడంతో అన్ని పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. మాటల తూటాలు పేల్చుతూ.. ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా అభ్యర్థుల కోసం ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు.. పార్టీ క్యాడర్ గెలుపు కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయా పార్టీల ప్రచార రథాల మైకులు గ్రామాలు, పట్నాల్లో హోరెత్తుతున్నాయి. సామాజికవర్గాల వారీగా ఆయా పార్టీలు సమావేశాలు పెట్టి ఓటర్లను తమ వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లో కారు ప్రచారం దూసుకుపోతున్నది. మహబూబ్‌నగర్‌లో పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మార్నింగ్ వాక్, రోడ్ షోలు చేస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో రోడ్ షోలు నిర్వహించడంతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోగా.. బీఆర్ఎస్ నేతల్లో జోష్ నెలకొన్నది. ఎక్కడికెళ్లినా ప్రజలు ఆదరిస్తుండడంతో గులాబీ శ్రేణులు ప్రచారంలో దూకుడు పెంచాయి.

కేసీఆర్ బస్సు యాత్రతో మారిన సమీకరణలు..

ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం.. కరెంట్ కోతలు, కరువు, మంచినీటి సమస్యతో జనం సతమతమవుతున్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు సుభిక్షంగా ఉన్న రైతాంగం, ఇతర వర్గాలు.. కాంగ్రెస్ హయాంలో పాత రోజులను గుర్తుకు తెచ్చుకునే పరిస్థితి నెలకొన్నది. పంటలు ఎండిపోవడం, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, గ్యారెంటీలను అమలు చేయకపోవడం వంటి అంశాలు బీఆర్ఎస్‌కు బాగా కలిసొస్తున్నాయి. దీంతో క్యాడర్‌లో జోష్ పెంచేందుకు ఏకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల పాటు రోడ్ షోలు నిర్వహించారు. దీంతో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో కారు జోరందుకున్నది. కేసీఆర్ రోడ్ షోలు ఊహించని విధంగా సక్సెస్ కావడంతో కాంగ్రెస్, బీజేపీలు డీలా పడ్డాయి. ప్రచారంలో కారు టాప్ గేర్‌లో దూసుకుపోతుండడంతో మిగతా పార్టీల అభ్యర్థులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కేసీఆర్ టూర్ గులాబీ శ్రేణుల్లో జోష్ నింపగా.. ఇదే జోరుతో పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురవేయాలని పార్టీ నేతలు ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు.

మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలపై బాధ్యతలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచార బాధ్యతలు భుజాన పెట్టుకొని అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్నారు. పాలమూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న మన్నె శ్రీనివాసరెడ్డి గెలుపు బాధ్యతలను మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అల వెంకటేశ్వర్‌రెడ్డి స్వీకరించి అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు బాధ్యతను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి తీసుకొని అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థితో కలిసి విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల సమీపిస్తుండడంతో రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కార్యకర్తలను వెంటేసుకొని కారు గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రచారానికి వస్తున్న స్పందనను చూసి జాతీయ పార్టీల నేతలు హడలిపోతున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలు సైతం ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

నిజమైన సెక్యులర్ పార్టీ బీఆర్ఎస్

- కేసీఆర్‌తో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం
- కాంగ్రెస్ సర్కారు వచ్చాకే కానుకలు నిలిచాయి..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మైనార్టీలను విస్మరించిన పార్టీలకు బుద్ధి చెప్పాలి
- ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 2 : దేశంలో నిజమైన సెక్యులర్ పార్టీ ఏదైనా ఉందంటే.. అది బీఆర్ఎస్సేనని... అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిచ్చిన గులాబీ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మైనార్టీలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మహబూబ్‌నగర్‌లో హజ్ హౌస్ నిర్మాణానికి రూ.కోటి నిధులు కూడా తీసుకొచ్చామన్నారు. అత్యాధునిక వసతులతో గురుకుల భవనాల నిర్మాణానికి రూ.125కోట్లు, ఇమాం.. మౌసంలకు డబుల్ బెడ్రూంలు ఇచ్చిన విషయాన్ని మాజీ మంత్రి గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ.. కాంగ్రెస్ ఒక్కటై బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే పండుగల వేళ పేదలకు కానుకలు నిలిచిపోయాయన్నారు. ఇమాం.. మౌసంలకు గౌరవ వేతనాలు లేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పదేండ్లలో పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని.. నామినేటెడ్ పదవుల్లో కూడా ముస్లింలకు ప్రాధాన్యతను ఇచ్చామన్నారు. అన్నివర్గాల సంక్షేమాన్ని కాంక్షించే ఏకైక పార్టీ బీఆర్ఎస్సేనన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీగా పంపిస్తే ఇక్కడి సమస్యల పరిష్కారానికి, ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్నారు.

మైనార్టీలకు అధిక ప్రాధాన్యం :ఎంపీ మన్నె

మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్.. బీజేపీ మైనారిటీలను విస్మరించాయన్నారు. ఇలాంటి పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో మైనారిటీ సీనియర్ నాయకులు రెహమాన్, మోసిన్, అహ్మద్, ఇమ్రాన్, మోసిన్ ఖాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలే..

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, మే 2 : కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కష్టాలు తప్పవని.. పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని లింగసానిపల్లి, వసంతాపూర్, గంగారం, లట్టుపల్లి, మంగనూర్ గ్రామాల్లో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడారు. మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి గోస పడొద్దన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అల్లోజీ, మాధవరెడ్డి, లక్ష్మయ్య, శ్రీను, మహేశ్వర్‌రెడ్డి, బాలస్వామి, తిరుపతి రెడ్డి, విష్ణు, శేఖర్‌రెడ్డి, శ్రీను, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

మాయమాటలు నమ్మొద్దు..

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- 8న కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి
- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 2 : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ మరోసారి మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నదని.. వారి మాటలు నమ్మొద్దని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా గద్వాల క్యాంప్ కార్యాలయం ఆవరణలో గురువారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. బీర్ఆఎస్ పాలనలో గద్వాల మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిదన్నారు. ఈనెల 8న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాలకు రానున్నారని.. పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకునేవాళ్లమన్నారు. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో నడిగడ్డపై గులాబీ జెండా ఎగరేసి అభివృద్ధిని కొనసాగిద్దామన్నారు. ఇతర పార్టీలకు గద్వాలలో అవకాశం లేదని.. వారి మోసాలను నడిగడ్డ ప్రజలు పసిగడతారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రవీణ్‌కుమార్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఇంతియాజ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, దౌలు, నరహరి శ్రీనివాసులు, నాయకులు సతీష్‌కుమార్, రామకృష్ణశెట్టి, గోవిందు పాల్గొన్నారు.

జాతీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 2 : కాంగ్రెస్, బీజేపీపై ప్రజలకు నమ్మకం పోయిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గురువారం కౌకుంట్ల మండలం అప్పంపల్లి, తిర్మలాపూర్, ఇప్రంపల్లి, కౌకుంట్లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాగా కౌకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన బెల్లం రాములు, బీజేపీకి చెందిన సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఆల సమక్షంలో కారెక్కగా వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల